క్లుప్తంగా

నియామకం

చిల్పూరు: మండలంలోని గార్లగడ్డ తండాకు చెందిన మాలోతు రమేష్‌నాయక్‌ను బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్‌గా నియమించినట్లు ఎమ్మెల్యే రాజయ్య సోమవారం ప్రకటించారు. రమేష్‌నాయక్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

మీడియా నియోజకవర్గ కార్యదర్శిగా అనిల్

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ కార్యదర్శిగా మండలంలోని ఇప్పగూడెంకు చెందిన గుండె అనిల్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ సోమవారం హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా గోపాల్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని తాటికొండకు చెందిన నారబోయిన గోపాల్ ఎన్నికైనట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎన్నికల ఇన్‌చార్జ్ రెడ్డబోయిన హరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్ సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

మెటీరియల్ అందజేత

జనగామ: జిల్లా కేంద్రం ధర్మకంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు వడ్లకొండ బాలసుబ్రమణ్యం జ్ఞాపకార్థం భార్య పద్మ సోమవారం ఉచితంగా మెటీరియల్ అందించారు. వార్షిక పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న 57 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు తదితర సామగ్రి ఇవ్వగా, డీఈఓ రామ్ చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందించారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ అధికారులు అర్జున్ కుమార్, సంపత్, శ్రీధర్, పాల్గొన్నారు.

విగ్రహం ప్రతిష్ఠించాలి

జనగామ: నిజాం రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించిన వీరుడు ఠానూనాయక్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంకుబండ్‌పై ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఠానూనాయక్ 73వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, గోపాల్, అజ్మీర, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ మండల కార్యదర్శిగా సంపత్

బచ్చన్నపేట : బీజేపీ మండల కార్యదర్శిగా సేవెళ్లి సంపత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఎన్నిక అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ మండల కమిటీలో ఉన్న పలు పదవుల ఖాళీలను పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్, ఉపాధ్యక్షుడు రావుల శ్రీకాంత్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు మెడల్బాటి రమేష్, పోతుల వెంకటేష్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసోమేశ్వర స్వామి మాస కల్యాణం

పాలకుర్తి టౌన్ : శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా చండిక అమ్మవారి ఆలయంలో సోమవారం చండికాసమేత శ్రీసోమేశ్వర స్వామి మాసకళ్యాణం మేళతాళాలు, అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని కనులారా తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నందూరి రజనీకుమారి, ఆలయ చైర్మన్ వెనుక దాసుల రామచంద్రయ్యశర్మ, అర్చకులు దేవగిరి రామన్న, లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



జఫర్‌గఢ్: పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని తిమ్మంపేట ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షలతో చేపడుతున్న నూతన భవన నిర్మాణ పనులకు ఆమె సోమవారం శంకుస్థాపన చేశా రు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. లిల్లిమేరి, నోడల్ ఆఫీసర్ ఎండీ.పర్వేజ్, ఏఈ కృష్ణారెడ్డి, వర్క్ఇన్స్‌పెక్టర్ అశోక్,పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్ : మాట్లాడుతున్న సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: అకాల వర్షాలు, ఈదురుగాలులతో పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. డివిజన్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రైతాంగ సమస్యల్ని పట్టించుకోవడం లేదన్నారు. అకాల వర్షాలతో ఆరుగాలం పండించిన పంటలు నష్టపోయి అన్నదాతలు ఆవేదన చెందుతున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా మొక్కజొన్న, వరి, మిర్చి, మామిడి, పొగాకు తోటలు నష్టపోయాయన్నారు. సర్వే చేయించి నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, లింగాజీ, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, విజయమేరీ, మేకల వరలక్ష్మీ, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, ఐలపాక శ్రీను, కోరుకొప్పుల మహేందర్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

దేవరుప్పుల : వడగళ్ల వానతో నష్టపోయిన అన్నదాతలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్ఆర్ టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

జఫర్‌గఢ్ : ఇటీవల కురిసిన వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడగండ్ల వర్షంతో వరి, మొక్కజొన్న, మిర్చి, బొప్పాయి, మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నష్టంపై సంబంధిత అధికారులతో ప్రభుత్వం పంట నష్టం సర్వే చేపట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కూరపాటి చంద్రమౌళి, రడపాక సత్యం, యాదగిరి, మల్లయ్య, పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలపై క్షేత్రస్థాయి సర్వే



తరిగొప్పుల: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఆర్ఐ రవీందర్

కొడకండ్ల : వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. వర్షానికి జనగామ జిల్లాలోనే అత్యధికంగా మండలంలో పంటలకు నష్టం వాటిల్లింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నష్టపోయిన పంటలను పరిశీలించి ఇతర మండలాల నుంచి వ్యవసాయ శాఖ అధికారులను డిప్యూటేషన్ వేసి సమగ్రంగా నష్టపోయిన పంటలను సర్వే చేయించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని బచ్చన్నపేట, రఘునాథపల్లి, పాలకుర్తి మండలాలకు చెందిన తొమ్మిది మంది ఏఈఓలను నష్టపోయిన పంటల సర్వేకు పంపించగా సోమవారం కొడకండ్ల, మొండ్రాయి క్లస్టర్లలోని వివిధ గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ఏఈఓలు నష్టపోయిన పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. మరో రెండు రోజుల పాటు సర్వే నిర్వహించి పూర్తిస్థాయిలో పంటల నష్టం వివరాలు సేకరిస్తామని ఏఓ రాజు తెలిపారు. మంత్రి దయాకర్‌రావు ఆదేశాల మేరకు నష్టపోయిన పంటల పూర్తి వివరాలను సేకరించి నివేదికను రూపొందించేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

తరిగొప్పుల: మండలవ్యాప్తంగా కురిసిన అకాల వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్ఐ రవీందర్ మండలంలోని బొత్తలపర్రె, జాలుబాయి తండా గ్రామాల పరిధిలో పర్యటించి దెబ్బతిన్న పంటనష్టాన్ని అంచనా వేశారు. మండల వ్యాప్తంగా 84 ఎకరాల్లో వరి పంట, 30 ఎకరాల్లో మొక్కజొన్న పంటనష్టం జరిగిందన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఏఈవో జయరాజు, రెవెన్యూ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

కల్వకుంట్ల కుటుంబ పాలన రద్దు చేయాలి



పాలకుర్తిటౌన్ : మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రూప్–1 పరీక్షలను రద్దు చేయడం కాదని, అవినీతి, అక్రమాలతో ప్రజలను పీడిస్తున్న కల్వకుంట్ల కుటుంబ పాలనను రద్దు చేయాలని మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామరావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో జరిగిన అవినీతి కుంభకోణానికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద నిరసన దీక్ష కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు బొక్క ప్రభాకర్, పార్లమెంట్ నియోజకవర్గ కో–కన్వీనర్ ఇనుగాల యుగేంధర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌యాదవ్, వీరన్న, వెంకట్‌రెడ్డి, అశోక్, విష్ణు, పూంద్రు నవీన్‌రెడ్డి, రడపాక ప్రదీప్, శ్రావణ్, పాల్గొన్నారు.

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

పాలకుర్తి టౌన్: టీఎస్‌పీఎస్సీ గ్రూపు–1 పేపర్ లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీజేపీ నియోజకవర్గస్థాయిలో పేపర్ లీకేజీలకు నిరసనగా నిర్వహించిన నిరసన దీక్షకు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అధ్యతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కనీసం ఒక్క నియామకాన్ని కూడా నిబంధనల ప్రకారం నిర్వహించకుండా విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌తో ఆట లాడుకుంటుందని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయులు పెదగాని సోమయ్య, పాకనాటి దామోదర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దొంగరి మహేందర్, దుబ్బ రాజశేఖర్, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, సుంకరనేని కోటేశ్వర్, పాలకుర్తి, కొడకండ్ల,దేవరుప్పల, తొర్రూరు మండలాల అధ్యక్షులు కమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, ఉపేందర్, నవీన్‌రెడ్డి, పల్లె కుమార్, పాల్గొన్నారు.

జనగామ: తెలంగాణరాష్ట్రంలో టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రం లీకేజీ పై సమగ్ర విచారణ జరిపించి దోషులకు కఠినంగా శిక్ష వేయాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ డి మాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, లీకేజీకి కారకులైన వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

బ్యాండ్ కళాకారులను ఆదుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రోజురోజుకు బ్యాండ్ కళ అంతరించిపోతుందని సీఎం కేసీఆర్ స్పందించి బ్యాండ్ కళాకారులను ఆదుకోవాలని బ్యాండ్ కళాకారుల సంఘం జిల్లా ఆర్గనైజర్ రహీంపాషా అన్నారు. సికింద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన జానపద కళల ప్రదర్శన కార్యక్రమంలో మండలంలోని ఇప్పగూడెం నుంచి వెళ్లి బ్యాండ్ కళాకారులు తమ కళను ప్రదర్శించగా అతిథులు శాలువాతో సన్మానించి మెమొంటోలను అందించారు.కార్యక్రమంలో కళాకారులు ఎండీ.మదర్, అన్నెపు రాములు, డబ్బ రాములు, సుధాకర్, బాలచందర్, అఫ్జల్‌మియా, పరమేష్, అనీల్, అబ్దుల్లా, అబ్బసలీ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించాలి

జనగామ రూరల్: పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుక్కల దాడి జరిగిందని వారికి రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని జనగామ అభివృద్ధి జాక్ కన్వీనర్ మంగళంపల్లి రాజు అన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటిని అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మహేష్, కౌశిక్ తదితరులు ఉన్నారు.

ప్రాణాలు కాపాడండి

జనగామ: జిల్లా కేంద్రంలో పెచ్చుమీరిపోతున్న కుక్కల బెడద నుంచి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీష్ సోమవారం మునిసిపల్ కమిషనర్ రజితకు విన్నవించారు. 3, 4 వార్డులతో పాటు తదితర ఏరియాల్లో కుక్కలు, కోతులతో వేగలేక పోతున్నారన్నారు. రెండు రోజుల క్రితం ఒక్కరోజే 21 మందిపై కుక్కలు దాడి చేశాయన్నారు. ఆయన వెంట వార్డు సభ్యులు చంద్రయ్య, నర్సింహారెడ్డి, శివకుమార్, మాశెట్టి నరేష్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

జఫర్‌గఢ్: మండలంలోని తీగారంలో ఇటీవల మృతి చెందిన కలకోట నిశాంత్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. సోమవారం నిశాంత్‌కుమార్ దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ రడపాక సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్‌ఎస్ నాయకులు పసునూరి మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సంఘ భవనాల ప్రొసీడింగ్స్ అందజేత

రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మహిళా, కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సోమవారం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులకు ఎమ్మెల్సీ సీడీపీ నిధుల ద్వారా మంజూరైన ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఖానాజీపేటలో గౌడ సంఘ భవనానికి రూ.5 లక్షలు, గోవర్ధనగిరిలో మహిళా సంఘం భవనానికి రూ.10 లక్షలు, కోడూర్‌లో కురుమ సంఘానికి రూ.5 లక్షలు, అలాగే మంగళిబండతండా నుంచి సేవాలాల్ ఆలయం వద్దకు రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఎమ్మెల్సీ వెంట పలువురు ఉన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

రఘునాథపల్లి: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘం మండల కార్యదర్శి కడారి ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బైరగోని బాలయ్య మాట్లాడారు.

స్టేషన్‌ఘన్‌పూర్: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొడెపాక యాకయ్య డిమాండ్ చేశారు. హమాలీ వర్కర్ల యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు.

కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలి

బచ్చన్నపేట : నిత్యం పనులు చేస్తూ ప్రమాదపు అంచున ఉంటున్న హమాలీ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి అన్నబోయిన రాజు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వినయలతకు పలు సమస్యల వినతిపత్రాన్ని అందించారు.

సీఎం కేసీఆర్, మంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం

జనగామ: సెర్ప్ ఉద్యోగులకు జీఓ 11 ద్వారా రెగ్యులరైజ్ చేయడాన్ని స్వాగతిస్తూ సీ ఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫ్లెక్సీకి ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సెర్ప్ జేఏసీ అధ్యక్షుడు ఎస్.సంపత్ పాల్గొన్నారు. 23 ఏళ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే రాజయ్యను కలిసిన ఉద్యోగులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి పేస్కేల్ వర్తింప చేసేలా జీఓ 11ను జారీ చేసినందుకు గాను హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను సెర్ప్ ఉద్యోగులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

లేబర్‌కార్డులతో బహుళ ప్రయోజనాలు

దేవరుప్పుల: గ్రామిక కుటుంబాలకు బహుళ ప్రయోజనాలు చేకూర్చే లేబర్ కార్డులను ప్రతి ఒక్క కార్మికుడి విధిగా తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక రంగాల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య సూచించారు. సోమవారం స్థానిక బీఎస్‌కేఆర్‌ఎస్ సమీక్ష సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు సోమయ్య అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక హక్కుల సాధన కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్టు వెల్లడించారు.

ముగ్గురికి గాయాలు

చిల్పూరు: భూతగాదా విషయంలో సోమవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.. బాధితులు, స్థానిక ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ కథనం ప్రకారం మండలంలోని లింగంపల్లికి చెందిన మాటూరి బాబు తమ్ముడు మాటూరి శ్రీనివాస్‌కు నాలుగేళ్లుగా భూతగాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ విషయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పంచాయితీ తీర్మాణం చేసుకోవాలని సూచించారు. అయినా బాబు పెద్దల మాట వినకుండా ప్రతీసారి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను బెదిరించడం చేసేవాడు. అందులో భాగంగా సోమవారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో బాబు కుమారుడు రాజేష్, బావమరిది విక్కితో పాటు 10 మంది శ్రీను ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో ఉన్న శ్రీను కూతురు సరిత గొడవలు వద్దని ప్రాధేయపడుతున్నా వినకుండా ఆమెను తీవ్రంగా కొట్టారు. అనంతరం కుమారుడు దిలీప్, శ్రీనివాస్‌పై దాడి చేయడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఎస్సై ఆస్పత్రికి తరలించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన మత్స్యకార్మికుడు, ముదిరాజ్ సంఘం నాయకుడు శాగ సత్యనారాయణ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య, గ్రంథాలయ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, ఇల్లందుల సుదర్శన్, జనగాం యాదగిరిలు సంతాపం తెలిపారు.

దేవునిగుట్టను పరిరక్షించుకుంటాం



జనగామ కోర్టుకు హాజరైన కడవెండి గ్రామస్తులు

దేవరుప్పుల : శ్రీ వానకొండయ్య లక్ష్మీనర్సింహస్వామి జాతర గుట్టను విధ్వంసం చేస్తే ఊరుకోమని, రాజకీయాలకతీతంగా దేవునిగుట్టను పరిరక్షించుకుంటామని బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ సుడిగెల హన్మంతు తెలిపారు. సోమవారం కడవెండి శివారు దేవునిగుట్ట క్వారీ అనుమతులు రద్దు కోసం ఆందోళన చేసిన 14 మందిపై కాంట్రాక్టర్ నల్లమారి మొగిలి కోర్టు ద్వారా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పని నష్టం కేసు నమోదు చేయగా వారు జనగామ కోర్టులో హాజరయ్యారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ కోర్టు నిబంధనల మేరకు తామంతా జడ్జి ముందు హాజరై చారిత్రాత్మక విశిష్టత కలిగిన దేవునిగుట్టను రక్షించుకునేందుకు పరిసర గ్రామాల ప్రజల సమక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా మాత్రమే క్వారీ పనులు నిలిపివేయాలని కోరామే తప్ప ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడలేదని వివరించామన్నారు. కోర్టుకు హాజరైన వారిలో ఉపసర్పంచ్ నగేష్, లీనారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రఫేల్‌రెడ్డి, మహేష్, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

‘కంటి వెలుగు’తో అంధత్వ నివారణ



పాలకుర్తి : తొర్రూరులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగిరెడ్డి

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల అంధత్వ నివారణకు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం ఉపయోగపడుతుందని ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి అన్నారు. సోమవారం మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి స్వామి, ఉప సర్పంచ్ చవాన్ నరేష్, , వైద్యులు రమ్య, ఆప్తాల్మిక్ ప్రవీణ్, పాల్గొన్నారు.

పాలకుర్తి : మండలంలోని తొర్రూరులో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ నల్లా నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయిని మల్లారెడ్డి, ఎంపీటీసీ, కౌసల్య, ఉపసర్పంచ్ సోమ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ : తండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బాదావత్ దేవి రవినాయక్ కోరారు. దుర్గ్యానాయక్ తండాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

లింగాలఘణపురం: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం మండలంలోని గుమ్మడవెల్లి, నాగారం, నెల్లుట్ల, పటేల్‌గూడెం, సిరిపురం గ్రామాలకు చెందిన బాధితులకు రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా ఏనెబావి నుంచి పిట్టలోనిగూడెంకు రూ.2 కోట్ల 50 లక్షలతో బీటీ రోడ్డు, కళ్లెం, నాగారం, నేలపోగుల, మాణిక్యాపురం గ్రామాలకు కమ్యూనిటీ భవన నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.5 లక్షల చొప్పున, ఆర్టీసీ కాలనీ ఖబ్రస్తాన్ ప్రహరీకి రూ.5 లక్షలు, కొత్తపల్లి, పటేల్ గూడెం, నెల్లుట్లకు రూ.5 లక్షల చొప్పున ఈజీఎస్ నిధులను మంజూరీ చేసిన ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డి, దుంబాల భాస్కర్‌రెడ్డి, మార్పు శ్రీనివాసరెడ్డి, భాస్కర్, సిద్ధులు, కృష్ణారెడ్డి, చంద్రమౌళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

పాలకుర్తి: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన చిలుకమారి వెంకటేశ్ కుటుంబానికి సహచరులు రూ.45 వేలు ఆర్థికసాయం సోమవారం అందించారు. పాఠశాలలో 2009–2010 సంవత్సరానికి చెందిన విద్యాజ్యోతి సహచర విద్యార్థులు భాన్విశ్రీ పేరిట డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వెంకటేశ్ భార్య వైష్ణవికి బాండ్‌ను అందజేశారు. సహచర విద్యార్థులు బండి ప్రశాంత్, జంపాల శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, బండి సోమయ్య ఉన్నారు.

నర్మెట : మండలంలోని వెల్దండ గ్రామానికి చెందిన దళితుడు బక్కమల్లు ప్రశాంత్‌కు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఒంటికి గాయాలు కాగా బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు నాగపురి కిరణ్ కుమార్ రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. తోడు ఆయన వెంట నాయకులు ఉదయ్‌కుమార్, నర్సింగారావు, అనిల్ పలువురు ఉన్నారు.

భయభ్రాంతులకు గురిచేస్తున్న జెడ్పీ చైర్మన్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాస్కర్, కుమారస్వామి

జనగామ రూరల్ : శ్రీహరికి భూమి ఇవ్వాలని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ఒత్తిడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని చిల్పూర్ మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన అన్నదమ్ములు బావండ్ల భాస్కర్, కుమారస్వామి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వేనెంబర్ 71లో ఎకరం 30 గుంటల భూమిని తండ్రి మొండయ్య ఇతరుల నుంచి కొనుగోలు చేశాడు. 1085లో పట్టా కాగా కుమారస్వామి పేరు మీద పట్టా చేసుకున్నాడు. ఇదే భూమిపై తమకు హక్కు ఉందని శ్రీహరి దౌర్జన్యం చేయగా కోర్టులో బాధితుడు కేసు వేశారు. సర్వే చేసి ఆర్డీఓ తమ పేరున భూమి ఉందని బాధితునికి నివేదిక ఇచ్చాడు. అప్పటి నుంచి భూమి కేసు కోర్టులో ఉండగా ప్రత్యర్థి శ్రీహరికి భూమి ఉందని పెద్దమనుషులతో మాట్లాడుకొని భూమిని శ్రీహరికి ఇవ్వాలని జెడ్పీ చైర్మన్ ఒత్తిడికి గురి చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

వందశాతం మొక్కలను బతికించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఈసీ జగదీష్

బచ్చన్నపేట : మండలంలోని గ్రామ పంచాయతీ పరిధిల్లో ఉన్న వన నర్సరీల్లో వందశాతం మొక్కలను బతికించాలని ఈజీఎస్ ఈజీ జగదీష్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నరామన్‌చర్ల లో పర్యటించి పల్లెప్రగతి పనులు, వన నర్సరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురియగానే రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ భూముల్లో, వ్యవసాయ భూముల వద్ద పొలం గట్లపై మొక్కలను నాటడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగి ఉన్న వారందరూ ఈజీఎస్ పనులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖలీల్‌బేగం, పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్, నాయకులు ఆజామ్ , జీపీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.